సాక్షి


డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం


ద్వారకా తిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు భద్రాచలానికి చెందిన పేరిశెట్టి వీర వెంకట శ్రీరామచంద్రమూర్తి శనివారం రూ.1,05,055 విరాళం సమర్పించారు.



వాడపల్లి వాసా.. శ్రీ వేంకటేశా..

కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి దివ్యక్షేత్రాన.. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. - 8లో▸

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 2,52,765 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే, తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నలుగురు ఎస్సైల బదిలీ

అమలాపురం టౌన్: జిల్లాలో నలుగురు ఎస్సైలు బదిలీలు అయ్యారు. ఈ మేరకు ఎస్పీ సుసరాపు శ్రీధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అల్లవరం ఎస్సై ఎల్.శ్రీనివాస్ నాయక్‌ను ఆలమూరు బదిలీ చేశారు. అమలాపురం టౌన్ ఎస్సై జి.హరీష్‌కుమార్‌ను అల్లవరంలో నియమించారు. ఆలమూరు ఎస్సై శివప్రసాద్‌ను ముమ్మిడివరానికి, అక్కడి ఎస్సై కె.సురేష్‌బాబు అమలాపురంలోని జిల్లా స్పెషల్ బ్రాంచి(డీఎస్‌బీ)కి బదిలీ చేశారు. అమలాపురం టౌన్, అల్లవరం ఎస్సైలు బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలలకే బదిలీ అయ్యారు. ఆలమూరు, ముమ్మిడివరం ఎస్సైలు బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తి కావడంతో బదిలీ అనివార్యమైంది. కాగా, జిల్లాలో ఎస్సైల బదిలీల పరంపర కొనసాగుతోంది. గత నెలలో ముగ్గురు ఎస్సైలను ఎస్పీ శ్రీధర్ బదిలీ చేసిన సంగతి తెలిసిందే. త్వరలోనే రెండేళ్లు మించి పని చేస్తున్న ఎస్సైలను కూడా బదిలీ చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

చింతలపల్లి హైస్కూలు.. జిల్లా ప్రథమం



ప్రతిభ చూపిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

రాజోలు: స్కూల్ గేమ్స్‌లో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన చింతలపల్లి ఉన్నత పాఠశాలకు జిల్లా స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. ఇందుకు కారకులైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య శనివారం అభినందించారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ చూపిన ఐదు పాఠశాలలను ఎంపిక చేయగా.. 131 పాయింట్లతో తమ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందని హెచ్‌ఎం చెప్పారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ అవార్డు ఇస్తారని తెలిపారు. బాక్సింగ్, ఫెన్సింగ్, కరాటే, క్రికెట్, త్రోబాల్, రెజ్లింగ్ పోటీల్లో 25 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి పతకాలు కైవసం చేసుకున్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్‌ను, క్రీడాకారులను సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు తదితరులు అభినందించారు.

బాలబాలాజీ సన్నిధిలో భక్తుల కోలాహలం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి, తమ కోర్కెలు నెరవేరాలని వేడుకున్నారు. ఉభయ దేవేరులతో కొలువు తీరిన స్వామి వారిని దర్శించుకుని ఆనందపరవశులయ్యారు. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.1.67 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి, తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.27 లక్షలు, నిత్యాన్నదానం ట్రస్టుకు విరాళాలుగా రూ.40,380 చొప్పున ఆదాయం వచ్చింది. మొత్తం 3,296 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి అన్న ప్రసాదాన్ని 2,578 మంది స్వీకరించారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని దర్శించేందుకు ఉదయం నుంచే తరలి వచ్చారు. రత్నగిరిపై శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున అధిక సంఖ్యలో వివాహాలు జరిగాయి. వీటికి వచ్చిన వారితో పాటు సాధారణ భక్తులతో ఆలయం కిక్కిరిసింది. మధ్యాహ్నం 2 గంటల వరకూ రద్దీ కొనసాగింది. సత్యదేవుని సుమారు 30 వేల మంది దర్శించారని అధికారులు తెలిపారు. వ్రతాలు 2,800 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు.



బొమ్మల తయారీలో రాజస్థానీ కళాకారులు



చవితి వేడుకలకు సిద్ధమైన గణనాథులు



బొమ్మలకు రంగులు అద్దుతూ..

జీవనానికి బొమ్మరథం

సండే స్పెషల్

- రాజస్థానీల చేతిలో రూపు దిద్దుకుంటున్న కళాకృతులు
- వైట్ సెమ్‌తో వివిధ రకాల బొమ్మలకు జీవం
- వినాయక చవితికి గణేశ విగ్రహాల తయారీకి ప్రాధాన్యం
- అన్ సీజన్‌లో అలంకరణ బొమ్మల విక్రయం
- జిల్లాలో ఉపాధి పొందుతున్న 200 పైగా కుటుంబాలు


మండపేట: శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవారు సృష్టికే అందాలు తెచ్చినారూ.. అన్నారు మనసు కవి ఆచార్య ఆత్రేయ. ఆయన రాసిన ఈ పాట ఇప్పటికీ జనం నాలుకలపై నర్తిస్తూ.. మన దేశ శిల్పకళా వైభవాన్ని చాటుతోంది. శిలలతో కొందరు.. మట్టి ముద్దలతో మరికొందరు వివిధ కళాకృతులు రూపొందిస్తుండగా.. కాలానుగుణంగా మరికొందరు ట్రెండ్ మార్చారు. ముఖ్యంగా రాజస్థానీయులు జీవం ఉట్టిపడే శిల్పాలను వైట్ సిమెంటుతో అలవోకగా తయారు చేస్తున్నారు. వైట్ సెమ్ ముద్దకు రూపు దిద్ది.. ఆకట్టుకునేలా రంగులద్ది.. తమ హస్తకళా నైపుణ్యంతో అందమైన, అద్భుతమైన కళాకృతులకు జీవం పోస్తున్నారు. బొజ్జ గణపయ్య.. రాధాకృష్ణులు.. పిల్లనగ్రోవితో గోపాలుడు.. కుబేరుడు.. బుద్ధుడు.. చెట్టుకొమ్మపై రామచిలుకలు.. ఏనుగులు.. ఇలా ఎన్నో కళారూపాలను రోడ్డు పక్కనే అలవోకగా తయారు చేసేస్తున్నారు. ఈ ప్రతిమలు ఒకపక్క వీరికి జీవన భృతి కల్పిస్తుండగా.. మరోపక్క ఇళ్లకు సరికొత్త శోభను తీసుకువస్తున్నాయి.

రాజస్థాన్ నుంచి మన సీమకు..

రాజస్థాన్‌లోని పాలీ జిల్లాకు చెందిన 200కు పైగా కుటుంబాల వారికి బొమ్మల తయారీనే వృత్తి. దీనిపైనే ఆధారపడి వారు పొట్ట చేత పట్టుకుని మన జిల్లాకు చేరుకుని.. ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. ముమ్మిడివరం, ద్రాక్షారామ, రామచంద్రపురం, మండపేట, రావులపాలెం, ఈతకోట, పి.గన్నవరం, రాజోలు తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసుకుని, అక్కడే నివసిస్తూ.. ఇంటిల్లిపాదీ బొమ్మల తయారీతో ఉపాధి పొందుతున్నారు. జీవం ఉట్టిపడేలా బొమ్మలు తయారు చేయడం వారికి వారసత్వంగా అబ్బిన విద్య. తమ పూర్వీకులు మట్టితో బొమ్మలు తయారు చేసే వారని.. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుతం వైట్ సిమెంట్‌తో బొమ్మలు అధికంగా తయారు చేస్తున్నామని వారు చెబుతున్నారు. వీరే కాదు.. ఇదేవిధంగా రాజస్థాన్‌కు చెందిన ఎన్నో కుటుంబాల వారు ఆంధ్రాకు వలస వచ్చి బొమ్మల తయారీపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

జైజై గణేశా..

వినాయక నవరాత్ర ఉత్సవాల్లో 'జైజై గణేశా' అంటూ కుర్రకారు కోలాహలం చేయాలంటే.. ముందుగా ఈ రాజస్థానీ కళాకారుల చేతిలో బొజ్జ గణపయ్య విగ్రహాలు రూపుదిద్దుకోవాల్సిందే. వినాయక చవితి వేడుకల కోసం గణనాథుని విగ్రహాల తయారీకి వీరు అధిక ప్రాధాన్యం ఇస్తారు. చవితి వేడుకలకు ఆరు నెలల ముందు నుంచే వినాయక విగ్రహాల తయారీ ఆరంభిస్తారు. అడుగు నుంచి 15 అడుగుల ఎత్తు వరకూ విగ్రహాలను ఈ కళాకారులు అలవోకగా తయారు చేస్తుంటారు. సైజును బట్టి ఒక్కో విగ్రహం తయారీకి మూడు రోజుల నుంచి వారం రోజుల వరకూ సమయం పడుతుంది. గణపతి విగ్రహం సైజు, డిజైన్‌ను బట్టి రూ.3 వేల నుంచి రూ.75 వేల వరకూ విక్రయిస్తారు.



గౌతమ బుద్ధుడు

బొమ్మల తయారీ ఇలా..

తొలుత వైట్‌సెమ్ మిశ్రమాన్ని పేస్టులా తయారు చేస్తారు. ఆయా రకాల ఆకృతుల్లో ఉన్న రబ్బరు ఫ్రేముల్లో ఈ మిశ్రమాన్ని పోస్తారు. కొద్దిసేపటి తర్వాత ఆ రబ్బరు ఫ్రేములను తొలగించి బొమ్మలను ఎండలో ఆరబెడతారు. అవి గట్టిపడ్డాక బొమ్మను బట్టి అవసరమైన రంగులు అద్దుతారు. ఈ విధంగా అరడుగు ఎత్తు నుంచి సుమారు మూడడుగుల ఎత్తు వరకూ ఆయా రకాల బొమ్మలు తయారు చేస్తుంటారు. పర్యావరణానికి హాని కలగని రీతిలో ప్రభుత్వ నిబంధనల మేరకు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈ కళాకారులు చెబుతున్నారు. బొమ్మలకు వేసే ఫ్లోరోసెంట్, రేడియం రంగులను పూర్తిగా నిషేధించడంతో.. సహజమైన అద్దకపు రంగులు వేస్తున్నామని, వీటి వలన కాలుష్యం ఉండదని వారంటున్నారు.

కోవిడ్‌లో విలవిల

పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాల తయారీకి ఈ కళాకారులు అప్పులు చేసి, పెట్టుబడులు పెడుతుంటారు. కోవిడ్ కష్టకాలంలో పనుల్లేక వీరు విలవిలలాడిపోయారు. లాక్‌డౌన్‌తో ప్రజలు ఉత్సవాలకు దూరం కావడంతో బొమ్మలు అమ్ముడు పోక, మరోపక్క చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్రంగా సతమతమయ్యారు. కోవిడ్ ప్రభావంతో రెండేళ్ల పాటు వీరి వ్యాపారం అంతంత మాత్రంగానే జరిగింది. ఆ సమయంలో షోకేస్ బొమ్మలు తయారు చేసి, ఇంటింటికీ తిరిగి విక్రయించడం ద్వారా వీరు ఉపాధి పొందేవారు. కరోనా మహమ్మారికి క్లెం పడి తరువాత గత ఏడాది నుంచి వినాయక బొమ్మల అమ్మకాలు పెరిగాయని వీరు చెబుతున్నారు.

అలంకరణ బొమ్మలతో...

వినాయక చవితి వేడుకలు ముగిసిన అనంతరం.. ఈ రాజస్థానీ కళాకారులు ఉపాధి కోసం ఇళ్లకు శోభను తీసుకువచ్చే అలంకరణ బొమ్మల తయారీ చేపడతారు. వీటిని రోడ్ల పక్కన, తోపుడు బండ్లపై తిరిగి విక్రయిస్తుంటారు. రోడ్డు పక్కన కొలువై ఉన్న రంగురంగుల బొమ్మలను ప్రయాణికులు ఆగి తమకు నచ్చినవి కొనుగోలు చేసుకుంటుంటారు. బొమ్మను బట్టి రూ.50 నుంచి రూ.1,200 వరకూ విక్రయిస్తారు. అలంకరణ బొమ్మల్లో ఖర్చులు పోగా ఒక్కో బొమ్మకు రూ.10 నుంచి రూ.100 వరకూ మిగులుతుందని రాజస్థానీ కళాకారులు చెప్పారు.

చిన్నప్పట్నుంచీ ఇదే వృత్తి



చిన్నతనం నుంచి బొమ్మల తయారీయే మా వృత్తి. కొన్నేళ్లుగా మండపేటలో కుటుంబ సమేతంగా వినాయక విగ్రహాలు, షోకేస్ బొమ్మల తయారీతో ఉపాధి పొందుతున్నాం. కోవిడ్ తర్వాత గత ఏడాది అమ్మకాలు ఫర్వాలేదు.

– కిషన్, కళాకారుడు, రాజస్థాన్

ఇంటికి శోభను తెస్తాయి



రాజస్థానీ కళాకారులు బొమ్మలు చాలా అందంగా తయారు చేస్తుంటారు. గౌతమ బుద్ధుడు, రాధాకృష్ణులు, రామచిలుకలు, దేవతామూర్తుల బొమ్మలు చూడ ముచ్చటగా ఉంటాయి. ఇంటి కప్‌బోర్డులు, షోకేసులకు మంచి శోభను తెస్తుంటాయి.

– రావూరి దుర్గాప్రసాద్, మండపేట

శాస్త్రవేత్తల కృషితో చంద్రయాన్ విజయవంతం



ఇస్రో శాస్త్రవేత్త సురేష్‌బాబు తల్లిదండ్రులు సత్యభారతి, కామేశ్వరరావులను సన్మానిస్తున్న సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు

- ఆ ప్రాజెక్టులో దేవగుప్తానికి చెందిన శాస్త్రవేత్త కీలక భాగస్వామ్యం
- ఆయన తల్లిదండ్రులకు సన్మానం

అల్లవరం: చంద్రయాన్-3 ప్రాజెక్టు లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్ (ఎల్‌పీఎస్‌సీ) క్రయోజెనిక్ విభాగంలో మండలంలోని దేవగుప్తం గ్రామానికి చెందిన శాస్త్రవేత్త బలభద్ర సురేష్‌బాబు కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సచివాలయంలో సురేష్‌బాబు తల్లిదండ్రులకు శనివారం ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు మాట్లాడుతూ, ఇస్రో శాస్త్రవేత్తలు నాలుగేళ్లుగా సాగించిన అకుంఠిత కృషి ఫలితంగా చంద్రయాన్-3 విజయవంతమై, ప్రపంచ ఖ్యాతిని సంపాదించుకుందని అన్నారు. చంద్రయాన్-3 విజయంతో 140 కోట్ల ప్రజల ఆకాంక్షను ఇస్రో నిజం చేసిందని పలువురు వక్తలు కొనియాడారు. చంద్రయాన్ విజయంలో గ్రామానికి చెందిన సురేష్‌బాబు కీలక పాత్ర పోషించడం యావత్తు దేశానికే గర్వకారణమని అన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, ప్రభుత్వ పాఠశాలలో చదివి, చంద్రునిపై పరిశోధనలు చేసే స్థాయిలో సురేష్‌బాబు ఉండటం తమ గ్రామానికి ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. ఆయన మరిన్ని విజయాలు సాధించి, గ్రామానికే కాకుండా, యావత్తు దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. సురేష్‌బాబు తండ్రి కామేశ్వరరావు మాట్లాడుతూ, సురేష్‌బాబుకు చిన్నప్పటి నుంచీ ప్రశ్నించే తత్వం ఉందన్నారు. మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని సురేష్‌బాబు ఈ స్థాయిని అందుకున్నారని చెప్పారు. అనంతరం సురేష్‌బాబు తల్లిదండ్రులు సత్యభారతి, కామేశ్వరరావులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తిక్కిరెడ్డి శ్రీను, సుందరనీడి సాయి, ఎంపీటీసీ సభ్యుడు ముత్తాబత్తుల రాంబాబు, హెచ్‌ఎం వేణుగోపాల్, ఏఎంసీ డైరెక్టర్ ఈతకోట సతీష్, జగనన్న గృహ సారథుల కన్వీనర్ కుదుపూడి సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

- సెర్ప్ ఉద్యోగులకు పెరిగిన జీతాలు
- ఆగస్టు నుంచి పెరుగుదల
- వచ్చే నెల నుంచి వారి ఖాతాల్లో జమ
- బేసిక్‌పై 23 శాతం పెంపు

సాక్షి, అమలాపురం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యాన పని చేసే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచింది. సెర్ప్ పరిధిలోని వైఎస్సార్ క్రాంతి పథకంలో పని చేసే ఈ ఉద్యోగులు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఉన్నతికి విశేష కృషి చేస్తున్నారు. అయితే పనికి తగిన జీతం రావడం లేదని కొంతకాలంగా వీరు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. దీనిని సానుభూతితో పరిశీలించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. వారి జీతాలు పెంచుతూ ఈ నెలలో జీఓ 64 విడుదల చేసింది. బేసిక్‌పై ఏకంగా 23 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెరిగిన జీతాన్ని ఆగస్టు 1వ తేదీ నుంచి వర్తింపజేస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది. పెరిగిన జీతం వచ్చే నెలలో అందనుండటంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీల అభివృద్ధికి కృషి

సెర్ప్ ఉద్యోగుల్లో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం), అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం), కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు (సీసీ), అడ్మిన్ అసిస్టెంట్లు (ఏఏ), ఆఫీస్ అసిస్టెంట్లు (ఓఏ) ఉన్నారు. వీరిలో చాలా మంది 2002 నుంచి కూడా పని చేస్తున్నారు. వాణిజ్య బ్యాంకుల ద్వారా ఎస్‌హెచ్‌జీలకు రుణాలు ఇప్పించడంతో పాటు వాయిదాలు కట్టించడం, అలాగే స్త్రీనిధి బ్యాంకు ద్వారా రుణాలివ్వడం, ఆయా ఎస్‌హెచ్‌జీల వ్యాపారాభివృద్ధికి తోడ్పాటు ఇవ్వడం వంటి బాధ్యతలు వీరు నిర్వర్తిస్తున్నారు. జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, జగనన్న పాల వెల్లువ, ఉన్నతి వంటి ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నారు. వారి నైపుణ్యాభివృద్ధికి అవసరమైన శిక్షణ ఇస్తున్నారు. మహిళలతో చిన్న వాటి నుంచి పెద్దపెద్ద వ్యాపారాల వరకూ ఏర్పాటు చేయించి, మార్కెటింగ్ అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఉండే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్(వీఓఏ-యానిమేటర్ల)తో సమన్వయం చేసుకుంటూ సంఘాల అభివృద్ధికి చేయూతనందిస్తున్నారు.

జిల్లాలో 59 మందికి మేలు

ఇలా స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి తోడ్పడుతున్న వీరు.. మెరుగైన జీవనోపాధి కోసం తమ జీతాలు పెంచాల్సిందిగా కొన్నేళ్లుగా కోరుతూ వస్తున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వీరి జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా జిల్లాలోని ఇద్దరు డీపీఎంలు, నలుగురు ఏపీఎంలు, 43 మంది క్లస్టర్ కో ఆర్డినేటర్లు, ఆరుగురు అడ్మిన్ అసిస్టెంట్లు, నలుగురు ఆఫీస్ అసిస్టెంట్లు కలిపి మొత్తం 59 మందికి జీతాలు పెరిగాయి. ఒక్కొక్కరికి బేసిక్ జీతంపై రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకూ జీతం పెరిగింది. సెర్ప్ ఉద్యోగుల్లో కొంత మంది 2002 నుంచి కూడా పని చేస్తున్నారు. వీరికి గతంలో ఉద్యోగ భద్రతను కల్పించింది నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కావడం విశేషం. అప్పట్లో తండ్రి వైఎస్సార్ ఉద్యోగ భద్రత కల్పించగా, నేడు ఆయన తనయుడైన సీఎం జగన్ వీరి జీతాలు 23 శాతం పెంచి తోడ్పాటు అందించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో జీతాలు పెరగడంపై ఆ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జీతాల పెంపు ఆనందాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌తో పంచుకుంటున్న సెర్ప్ ఉద్యోగులు


మెరుగైన జీతం ఇస్తున్నారు



ప్రస్తుత జీవన విధానంలో ఇంత వరకూ మాకు ఇచ్చింది చాలీచాలని జీతం కిందే లెక్క. ఈ సమయంలో మా జీతం 23 శాతం పెంచడం చాలా ఆనందంగా ఉంది. దీని వల్ల కుటుంబ జీవనోపాధికి ఇబ్బంది ఉండదు. ఆర్థికంగా నిలదొక్కుకుంటాం. ఉత్సాహంగా పని చేయడానికి ఇదొక అవకాశం. ప్రభుత్వ పథకాలను ప్రతి లబ్ధిదారుకూ చేర్చేందుకు మరింత కష్టపడతాం. సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, ఏపీఎం, అయినవిల్లి మండలం

హర్షణీయం



సెర్ప్ పరిధిలోని వైఎస్సార్ క్రాంతి పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు బేసిక్‌పై ఏకంగా 23 శాతం జీతం పెంచడం హర్షణీయం. సీఎం జగన్ తీసుకున్న ఈ నిర్ణయం మాకు చాలా సంతోషాన్నిచ్చింది. నేను 2008లో విధుల్లో చేరాను. ఇప్పుడు నా జీతం రూ.5 వేల వరకూ పెరుగుతోంది.

– డీటీ నాగరాజు, క్లస్టర్ కో ఆర్డినేటర్, మలికిపురం

క్లుప్తంగా

14, 15 తేదీల్లో 'నన్నయ'లో టెక్ ఫెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యాన వచ్చే నెల 14, 15 తేదీల్లో అద్విక-23 పేరిట జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్ జరగనుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు శనివారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్లు, టెక్ క్విజ్, షార్ట్ ఫిల్మ్ మేకింగ్, ప్రజెంటేషన్ ఆఫ్ ఐడియా విత్ వర్కింగ్ హైపోథీసిస్ డిబేట్ వంటి సాంకేతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజుతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఈ టెక్ ఫెస్ట్‌కు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు కన్వీనర్‌గా, బి.లక్ష్మి కో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. లేదా 70930 08482 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు.

విద్యుత్ వైరు చోరీ

కొత్తపల్లి: కొమరగిరిలోని జగనన్న ఇళ్ల స్థలాల లే అవుట్ కోసం తీసుకువచ్చిన విద్యుత్ వైరు అపహరణకు గురైంది. పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ లే అవుట్‌లో విద్యుత్ లైన్లు బిగించేందుకు సుమారు 300 కేజీల విద్యుత్ వైరు తీసుకువచ్చారు. దీనిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారంటూ కాంట్రాక్టర్ జి.రామ్మోహన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి వాసా.. శ్రీ వేంకటేశా..

- ఘనంగా స్వామి వారి పవిత్రోత్సవాలు ప్రారంభం
- శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- రూ.34.35 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: గౌతమీ గోదావరి తీరాన.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి దివ్యక్షేత్రాన.. శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేద పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యాన అర్చకులు స్వామి, అమ్మవార్లను సుగంధాలు వెదజల్లే రంగురంగుల పుష్పమాలికలు.. అరటి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి, పూజల అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఆలయ ఆవరణలో స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలుత ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షధారణ, అకల్మష హోమం తదితర వైదిక క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పవిత్రోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సాయంత్రం 5 గంటలకు పవిత్రారోహణం, విశేష అర్చన, పవిత్ర ప్రతిష్ఠ, ప్రధాన హోమాలు నిర్వహించనున్నారు.

మార్మోగిన గోవింద నామం

స్వామి వారి దర్శనానికి వేలాదిగా వచ్చిన భక్తులతో వాడపల్లి క్షేత్రంలో గోవింద నామం మార్మోగింది. సుమారు 35 వేల మంది భక్తులు తరలివచ్చారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, విరాళాల రూపంలో స్వామి వారికి రూ.34,35,475 ఆదాయం సమకూరింది. వేలాదిగా వచ్చిన భక్తుల వాహనాలతో పార్కింగ్ స్థలం కిక్కిరిసిపోయింది. ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



స్వామి వారి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న పండితులు



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు

యువకుడి మృతదేహం లభ్యం



కార్తీక్ (పాతచిత్రం)

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రం స్నాన ఘట్టం వద్ద గోదావరి నదిలో ఈ నెల 24న గల్లంతైన ఇనపల కార్తీక్ మృతదేహం శనివారం ఔరంగబాద్ సమీపాన లభ్యమైంది. నదిలో స్నానానికి దిగిన భార్య భవాని ప్రవాహంలో కొట్టుకుపోతుండగా రక్షించేందుకు నదిలోకి దిగిన కార్తీక్ గల్లంతైన విషయం తెలిసిందే. స్థానికులు భవానీని రక్షించి ఒడ్డుకు చేర్చారు. నదిలో కొట్టుకుపోయిన కార్తీక్ జాడ కోసం జాలర్ల సాయంతో కుటుంబ సభ్యులు, అగ్నిమాపక సిబ్బంది రెండు రోజులుగా నదిలో గాలించారు. కార్తీక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు వాసి. కార్తీక్ దంపతులు ఈ నెల 24న దంపతులు మోటార్ సైకిల్‌పై తణుకు వెళ్లారు. తిరిగి స్వస్థలానికి వెళ్తూ, మార్గం మధ్యలో శ్రావణ మాసం సందర్భంగా గోష్పాద క్షేత్రంలో నదీ స్నానం ఆచరించేందుకు వచ్చి ఈ ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనపై పట్టణ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ బాబూరావు కేసు నమోదు చేశారు.

రత్నగిరిపై రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఓ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రకాష్ సదన్ సత్రంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న యడ్ల బుల్లెబ్బాయిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. సత్రం గదులు అద్దెకిచ్చిన సందర్భంగా కార్యాలయంలో ఉండాల్సిన నగదు కన్నా సుమారు రూ.6 వేలు తక్కువగా ఉన్నట్టు అధికారుల తనిఖీలో తేలింది. ఈ విషయాన్ని ఈఓకు నివేదించడంతో అందుకు బుల్లెబ్బాయిని బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు.

అసైన్డ్ భూములపై హక్కు కల్పించాలి

- 20 ఏళ్లకు పైగా సాగు చేస్తున్న వారిని గుర్తించాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

అమలాపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు అసైన్డ్ భూములపై హక్కుదారులకు యాజమాన్య హక్కులు కల్పించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, వీఆర్‌ఓలతో ఆయన కలెక్టరేట్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష రీ సర్వే పూర్తయిన వాటితో పాటు ఇప్పటి వరకూ ప్రారంభించని గ్రామాల్లో.. 20 సంవత్సరాలు పైగా అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న హక్కుదారులను గుర్తించాలని చెప్పారు. ఆ భూములపై వారికి యాజమాన్య హక్కులు కల్పించే విధంగా సంబంధిత డేటాను కచ్చితత్వంతో వెబ్‌ల్యాండ్ పోర్టల్‌లో నమోదు చేయాలని మండల అధికారులను ఆదేశించారు.

గ్రామ సర్వీస్ ఈనాం భూముల్లో రైత్వారీ పట్టాకు సంబంధించిన యజమానులకు, వారి వారసులకు లేదా ప్రస్తుతం సర్వీసు ఈనాం భూములు కొనుగోలు చేసిన వారి తుది డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. ల్యాండ్ కన్వర్షన్, మ్యుటేషన్ డేటాతో పాటు ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల డేటాను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శుక్లా, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

విద్యార్థుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థుల పూర్తి వివరాలను స్టూడెంట్ ఇన్ఫో యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. విద్యా శాఖ, మున్సిపల్, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా వ్యవస్థల యాజమాన్యాలు, ఎంపీడీఓలతో కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి, స్టూడెంట్ ఇన్ఫో యాప్ పురోగతిపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ ఒకటని చెప్పారు. ఇది జరిగితేనే విద్యార్థులకు ప్రభుత్వ రాయితీలు అందే ఆస్కారం ఉంటుందని అన్నారు. 2005–18 మధ్య పుట్టిన విద్యార్థుల డేటా స్టూడెంట్ ఇన్ఫో యాప్‌లో నమోదు చేయాలన్నారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండే విధంగా వలంటీర్ల సహకారంతో చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈవో ఎం.కమలకుమారి, జిల్లా వృత్తి విద్యాధికారి సత్యనారాయరెడ్డి, జిల్లా గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్లు, వి.అయ్యప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా వైద్యాధికారులను ఆదేశించారు. వైద్య, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల పని తీరుపై కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. మాతా, శిశు మరణాల రేటును తగ్గించేందుకు, ఆరోగ్యకర సమాజ స్థాపనకు ఈ రెండు శాఖలూ సమన్వయంతో కృషి చేయాలని అన్నారు. సాధారణ ప్రసవాలన్నీ పీహెచ్‌సీల్లోనే నిర్వహించాలని, అక్కడ వీలు కాకుంటే హై రిస్క్ గర్భిణుల శస్త్రచికిత్సలు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆస్పత్రుల్లో నిర్వహించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పని చేసే గ్రామాల్లోనే నివాసం ఉండాలని స్పష్టం చేశారు. స్త్రీ, శిశు సంక్షేమ, కార్మిక, వైద్య శాఖల సమన్వయంతో టీనేజ్ బాలికలు గర్భం దాల్చకుండా చైతన్యపరచాలని సూచించారు. అనుబంధ పోషకాహారం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ సక్రమంగా అమలు చేసి, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో ఐరన్, రక్తహీనత, పోషకాహార లోపాలను సరిదిద్దాలని చెప్పారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయ అధికారి పద్మశ్రీరాణి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి జీవీ సత్యవాణి, డీఐఓ శ్రీనివాసరావు, సీడీపీఓలు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం



ఖాదర్ మృతితో జార్జిపేటలోని అతడి ఇంటి వద్ద విషాద ఛాయలు



ప్రమాద స్థలంలో తీవ్రంగా గాయపడిన అన్న ఖాదర్‌ను పట్టుకుని విలపిస్తున్న బషీర్

- 216 జాతీయ రహదారిపై ఢీకొన్న రెండు బైక్‌లు
- యువకుడి మృతి.. ముగ్గురికి గాయాలు



మృతుడు షేక్ ఖాదర్ (పాత చిత్రం)

తాళ్లరేవు: అతి వేగం ఒకరి ప్రాణం తీసింది. మరో ముగ్గురిని క్షతగాత్రుల్ని చేసింది. యానాం బైపాస్‌లో గణపతి నగర్ వంతెన వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్, మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని జార్జిపేట గ్రామ పంచాయతీకి చెందిన షేక్ ఖాదర్, షేక్ అబ్దుల్లా, షేక్ బషీర్ అన్నదమ్ములు. వీరు నీలపల్లి చెక్‌పోస్టు వద్ద కోళ్ల దుకాణంలో పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి కోళ్ల వ్యాను వచ్చిందనే సమాచారంతో కోళ్లను తెచ్చుకునేందుకు ఖాదర్, బషీర్ బైక్‌పై సుంకర పాలెం జంక్షన్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా వీరి బైక్, అదే మార్గంలో వస్తున్న మరో బైక్ ఢీకొన్నాయి. దీంతో రెండు మోటార్ సైకిళ్లూ అదుపు తప్పాయి. ఈ ప్రమాదంలో షేక్ ఖాదర్ రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొన్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడిని హుటాహుటిన స్థానికులు యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఖాదర్ తమ్ముడు బషీర్‌తో పాటు మరో బైక్‌పై వెళ్తున్న యానాంకు చెందిన కర్రి రాజు, కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన గుబ్బల కాశీ ప్రసాద్ గాయపడ్డారు. వారు యానాం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

20 ఏళ్ల క్రితం తండ్రి.. నేడు కొడుకు

రోడ్డు ప్రమాదాలు ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఖాదర్, అతడి సోదరుడు అబ్దుల్లా కవలలు. జార్జిపేట గ్రామానికి చెందిన హాసియా, బాషా దంపతులకు 20 ఏళ్ల క్రితం కవలలు ఖాదర్, అబ్దుల్లా జన్మించారు. అనంతరం ఆ దంపతులకు మూడో సంతానంగా బషీర్ పుట్టే సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాషా దుర్మరణం పాలయ్యాడు. తిరిగి మళ్లీ రోడ్డు ప్రమాదంలోనే కవల కొడుకుల్లో ఒకడైన ఖాదర్ మృతి చెందడం ఆ కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేస్తోంది. తనతో పాటే పుట్టి, తోడుగా పెరిగిన ఖాదర్ మృతితో అబ్దుల్లాతో పాటు అతడి కుటుంబ సభ్యులు కంటికి కడివెడుగా రోదిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో కొడుకు, మనవడిని కోల్పోయానని ఖాదర్ నానమ్మ అజ్మా బోరున విలపించింది. వారం రోజుల కిందటే కొత్త మోటార్ సైకిల్ కొన్నామని, దానిపై ఎంతో ఆనందంగా తిరుగుతున్న మనవడు ఖాదర్.. ప్రమాదానికి గురై ఇలా మృతి చెందుతాడనుకోలేదని కన్నీటిపర్యంతమవుతోంది.